# రా రమ్మని... రారా రమ్మని..

- కార్తిక వనభోజనాలకు ఆహ్వానం పలుకుతున్న ప్రకృతి అందాలు
- అందమైన జలపాతాలు, ప్రకృతి సొబగులతో నిండిన సాలూరు

సాలూరు: నియోజకవర్గంలో అబ్బురపరిచే జలపాతాలు, కనువిందు చేసే దట్టమైన అడవులు, ఎత్తయిన కొండలు వంటి ప్రకృతి అందాలు పర్యాటకులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. అందమైన జలపాతాలు, పక్షుల కిలకిలారావాలు, మనస్సును మరో ప్రపంచానికి తీసుకెళ్లే స్వచ్ఛమైన అడవితల్లి, నేలతల్లిని ముద్దాడే మంచు ఇలా అనేక ప్రకృతి అందాలు కార్తికమాసం వేళ వన భోజనాలకు ఆహ్వానం పలుకుతున్నాయి.

**అందమైన జలపాతాలు..**

సాలూరు నుంచి 19 కిలోమీటర్ల దూరంలో ఉన్న మామిడిపల్లి దాటితే దండిగాం జలపాతాలు వస్తాయి. వందల సంఖ్యలో పర్యాటకులు ఇక్కడకు వస్తుంటారు.

**నీలం వాటర్ ఫాల్స్..**

సాలూరు నుంచి 15 కిలోమీటర్ల దూరంలో పాచిపెంట మండలం పంచాది గురువునాయుడుపేట దాటితే నీలంవలస వెళ్లే దారిలో ఈ జలపాతాలు వస్తాయి. 40 అడుగుల ఎత్తున ఈ జలపాతం ఉంటుంది.

**దళాయివలస జలపాతం..**

సాలూరుకు 26 కిలోమీటర్ల దూరంలో మామిడిపల్లి, కురుకూటి గ్రామాలను దాటితే దళాయవలస వస్తుంది. ఈ గ్రామానికి బస్సు సౌకర్యం ఉంది. గ్రామానికి మూడు కిలోమీటర్ల దూరంలో రెండు కొండల మధ్య జలపాతం ప్రజలను కనువిందు చేస్తుంది.

**లొద్ద వాటర్‌ఫాల్స్..**

సాలూరు నుంచి మామిడిపల్లి, కందులపథం దాటి 25 కిలోమీటర్లు వెళితే నంద గ్రామం వస్తుంది. నంద దాటి కొటియా మార్గంలో వెళ్తే 3 కిలోమీటర్ల దగ్గర కుడివైపు కొదమ, చింతామల (చిన్నలొద్ద) వరకు ఆటోలు వెళ్తాయి. అక్కడ నుంచి సుమారు 5 కిలోమీటర్ల వెళితే లొద్ద జలపాతం వస్తుంది. ఈ జలపాతం ఎత్తు సుమారు 500 అడుగుల వరకు ఉంటుంది. దీనిని బహుబలి జలపాతంగా పిలుస్తారు.


లొద్ద జలపాతం


ఆలూరు జలపాతం

**శిఖపరువు వాటర్‌ఫాల్స్..**

సాలూరు నుంచి తోణాం వెళ్లి అక్కడ నుంచి 4 కిలోమీటర్ల దూరంలో ఉన్న శిఖపరువు జలపాతాలకు చేరుకోవచ్చు. ఇదే క్రమంలో దండిగాం నుంచి నేరెళ్లవలస మీదుగా కుంబిమండ జలపాతాలకు చేరుకోవచ్చు.

**ఆలూరు జలపాతం..**

సాలూరు నుంచి 22 కిలోమీటర్ల దూరంలో పాచిపెంట డ్యామ్ వెనుక ఆలూరు జలపాతం ఉంది. పొలాల గుండా రెండు కిలోమీటర్లు నడిచి వెళ్లి ఈ జలపాతాలను చేరుకోవచ్చు.


శిఖపరువు జలపాతం

## క్లుప్తంగా

### సామాజిక బస్సుయాత్రకు అనుమతి


డీఎస్పీకి దరఖాస్తు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పాలకొండ: వైఎస్సార్‌సీపీ చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్ర ఈ నెల 24న పాలకొండ నియోజకవర్గంలో జరగనుంది. ఈ మేరకు పార్టీ నాయకులు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు వెలమల మన్మథరావు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ఆదివారం డీఎస్పీ జీవీ కృష్ణారావును కలిసి బస్సు యాత్రకు అనుమతి కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా మన్మథరావు మాట్లాడుతూ..సామాజిక సాధికార బస్సుయాత్రను విజయవంతంగా చేపడతామన్నారు. నిబంధనల ప్రకారం పోలీసుల అనుమతులు తీసుకున్నామని వివరించారు.

### సేవలకు సత్కారం


సింహాచలంనాయుడును సన్మానిస్తున్న శివకేశవరావు, తదితరులు

గరుగుబిల్లి: జ్ఞానజ్యోతి గ్రంథాలయంలో స్వచ్ఛందంగా సేవలందించిన తోటపల్లి గ్రామానికి చెందిన డి.సింహాచలంనాయుడును ఆదివారం ఘనంగా సత్కరించారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా జిల్లా గ్రంథాలయ సంఘ అధ్యక్షుడు టి.శివకేశవరావు, ఏపీ గ్రంథాలయ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.పారినాయుడు, తదితరులు సింహాచలంనాయుడును సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏ స్వలాభం ఆశించకుండా గ్రంథాలయంలో దీర్ఘకాలం స్వచ్ఛందంగా సేవలందించడం గొప్ప విషయమన్నారు. గ్రామపెద్దలు సింహాచలంనాయుడు సేవలను కొనియాడారు.

### తాడికొండలో వికసిత్ సంకల్పయాత్ర


తాడికొండలో గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

గుమ్మలక్ష్మీపురం: మండలం కేంద్రంలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర ఆదివారం నిర్వహించారు. ఇందులో భాగంగా కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. మండల నోడల్ అధికారి ఎస్.సాల్మాన్‌రాజు ఆధ్వర్యంలో తాడికొండ, లంబేస్ గ్రామల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. జాతీయ జీవన ఉపాధిమిషన్, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన, పీఎం విశ్వకర్మ జన్‌ధన్ యోజన, జీవన్‌జ్యోతి బీమా యోజన, సురక్ష బీమాయోజన తదితర పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాధిక, సర్పంచ్‌లు ఎం.జగ్గారావు, సీతమ్మ, ఎంపీటీసీ ఎం.గౌరమ్మ, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గున్నారు.

### దిశయాప్‌తో రక్షణ


దిశ యాప్‌పై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

గరుగుబిల్లి: ప్రతి ఒక్కరూ తమ స్మార్ట్‌ఫోన్లలో దిశయాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలని స్థానిక పోలీస్ స్టేషన్ సిబ్బంది కృష్ణమోహన్, పి.చిన్నారావు అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం మండల కేంద్రంలోని గ్రంథాలయంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దిశ చట్టంపై, దిశ యాప్ వినియోగంపై పోలీసులు అవగాహన కల్పించారు. మహిళల స్మార్ట్‌ఫోన్లలో దిశ యాప్‌ను ఇన్‌స్టాల్ చేయించారు. ఈ యాప్ ఉంటే పోలీసులు మీ వెంట ఉన్నట్లేనని, అత్యవసర సమయంలో రక్షణ లభిస్తుందన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వాహకుడు ఎస్.మధుసూదనరావు, మహిళలు పాల్గొన్నారు.

### ఆలయ నిర్మాణానికి భూమిపూజ

సీతంపేట: టీటీడీ ఆధ్వర్యంలో మంజూరైన గ్రామదేవత ఆలయాల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. కొత్తపనుకువలసలో గ్రామంలో గ్రామదేవత ఆలయానికి ఆదివారం ఆమె భూమిపూజ చేశారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. నియోజకవర్గంలో వందకుపైగా గ్రామదేవత ఆలయాలు మంజూరయ్యాయన్నారు. ఒక్కో గుడికి రూ.10 లక్షల వరకు నిధులు విడుదలయ్యాయన్నారు. పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయ పంటకోత ప్రయోగం


మిర్తివలసలో పంటకోత ప్రయోగం నిర్వహించిన ఏఓ శ్రావణ్

బలిజిపేట: మండలంలోని మిర్తివలసలో వ్యవసాయశాఖ, ప్రకృతి వ్యసాయ ఎంపీఆర్‌పీల ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం చేసిన రైతు జి.గోవిందరావు పొలంలో ఆదివారం పంటకోత ప్రయోగం నిర్వహించారు. రైతు గోవిందరావు మసూరి పంట పొలంలో 5అడుగుల పొడవు, 5అడుగుల వెడల్పు విస్తీర్ణంలో 14.379కిలోల దిగుబడి వచ్చినట్లు ఏఓ శ్రావణ్‌కుమార్ తెలిపారు. ఈ ప్రకారం ఎకరాకు 29 బస్తాల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశాలున్నాయని చెప్పారు. దమ్ముకు ముందు పచ్చిరొట్ట విత్తనాలు వేసి దమ్ములో కలియదున్నడం వల్ల ఎరువుల వాడకం తగ్గిందని చెప్పారు. 400కిలోల ఘన జీవామృతాన్ని, 400లీటర్ల ద్రవ జీవామృతాన్ని, 100 లీటర్ల జిల్లేడు ద్రావణాన్ని ఎరువుల నిమిత్తం వినియోగించినట్లు చెప్పారు. తెగుళ్ల నివారణకు నీమాస్త్రాన్ని, తూటికాడ కషాయాన్ని వినియోగించారన్నారు. ఖర్చు తక్కువతో దిగుబడి ఎక్కువగా వచ్చిందని రైతులు గ్రహించాలని సూచించారు. ఎంపీఏబీ చైర్మన్ జి.గంగయ్య, సర్పంచ్ డి.భాస్కరరావు, ఎంసీఆర్‌పీ లక్ష్మి, ఐసీఆర్‌పీ తిరుపతిరావు, వీఏఏ ప్రశాంతి, రైతులు పాల్గొన్నారు.

# మహాధర్నా విజయవంతం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ మండలశాఖ అధ్యక్షరాలు లక్ష్మి

బలిజిపేట: ఈనెల 27, 28తేదీల్లో విజయవాడలోని జింఖానా గ్రౌండ్‌లో జరగనున్న కార్మిక, రైతు మహాధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ మండల శాఖ అధ్యక్షురాలు లక్ష్మి పిలుపునిచ్చారు. ఈ మేరకు బలిజిపేటలోని సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం సీఐటీయూ మండల సమావేశం నిర్వహించారు. కార్మికులు, రైతులు, ప్రజలకు, దేశానికి వినాశకర కార్పొరేట్ అనుకూల విధానాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తోందని, దానికి వ్యతిరేకంగా అందరం పోరాడాలని విజ్ఞప్తి చేశారు. ధరలను నియంత్రించాలని, ఆహారం, మందులు, వ్యవసాయ ఉపకరణాలపై జీఎస్టీ రద్దుచేయాలి. రైల్వే రాయితీలు పునరుద్ధరించి, ప్రజా పంపిణీ పథకాన్ని విస్తృతం చేసి ఆహార భద్రత కల్పించాలి. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ నిలిపివేయాలి. లీజు విధానం రద్దు చేయాలి. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలనే డిమాండ్లపై పోరాడాలని కోరారు. అందుకు అందరు సహకరించి మహాధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి మన్మథరావు, వి.సత్యంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యతా ప్రమాణాలతో ఇంటింటి కుళాయి పనులు చేపట్టాలి


పైపులను పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ ఆర్.పవన్‌కుమార్

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో జరుగుతున్న ఇంటింటి కుళాయిల పనులు నాణ్యతా ప్రమాణాలకు లోబడి నిర్వాహకులు చేపట్టాలని ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ ఆర్. పవన్‌కుమార్ కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన మండలంలోని సీతానగరం, నిడగల్లులో నిర్వాహకులు సమకూర్చిన పైప్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా రూ.82 లక్షలతో నిడగల్లులో ఇంటింటి కుళాయిల పనులు చురుగ్గా జరుగుతున్నాయని తెలియజేశారు. సీతానగరంలో రూ.55 లక్షల వ్యయంతో ఇంటింటి కుళాయిల నిర్మాణానికి సమకూర్చిన పైప్‌లను పరిశీలించినట్లు చెప్పారు. రెండు రోజుల్లో పనులు ప్రారంభించాలని నిర్వాహకులకు సూచించినట్లు తెలిపారు. అలాగే లచ్చయ్యపేటలో రూ 10 లక్షలతో ఓవర్‌హెడ్‌ట్యాంక్, రూ.14 లక్షల వ్యయంతో ఇంటింటి కుళాయిల పనులు పూర్తి కావచ్చాయని తెలియజేశారు. మండలంలోని లక్ష్మీపురం,లచ్చయ్యపేట గ్రామాల్లో ఇంటింటి కుళాయి పనులు పూర్తయ్యాయని, ఎమ్మెల్యే అలజంగి జోగారావు త్వరలో ప్రారంభించనున్నట్లు తెలియజేశారు.

# గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

- జిల్లా గ్రంథాలయాల చైర్‌పర్సన్ రెడ్డి పద్మావతి


గ్రంథాలయ వారోత్సవాలను పరిశీలిస్తున్న జిల్లా గ్రంథాలయాల చైర్‌పర్సన్ రెడ్డి పద్మావతి

పాచిపెంట: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని జిల్లా గ్రంథాలయాల చైర్‌పర్సన్ రెడ్డి పద్మావతి అన్నారు. మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఆదివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా నెహ్రూ చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, గ్రంథాయాలను సద్వినియోగం చేసుకుని మంచి విజ్ఞానాన్ని సంపాదించుకోవాలని తెలిపారు. విద్యార్థులు, యువత జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగడానికి గ్రంథాలయాలను ఉపయోగించుకోవాలని సూచించారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలో మూడు గ్రంథాలయాల భవనాల పనులు చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఉదయ్‌భాస్కర్, మన్మధరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

## తుపాను హెచ్చరికలతో రైతుల్లో ఆందోళన

గరుగుబిల్లి: అల్పపీడనం ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరికలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం పంటకోతలు ముమ్మరంగా జరుగుతుండడంతో పంటను కాపాడుకునేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. ప్రస్తుతం మండలంలోని పెదగుడబ, వల్లరగుడబ, చినగుడబ, గరుగుబిల్లి, పెద్దూరు, దళాయివలస, నాగూరు, ఉల్లిబద్ర, గొట్టివలస తదితర గ్రామాలలో ఖరీఫ్ వరిపంట కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఆదివారం ఆకాశంలో మబ్బులు కమ్ముకోవడంతో పంటను కాపాడుకునేందుకు పొలాల్లోనే చిన్నచిన్న కుప్పలుగా పెడుతున్నారు. కొందరు ట్రాక్టర్లు, నాటుబళ్లపై వరిచేనును కళ్లాలకు తరలిస్తున్నారు.

## ఉత్సాహంగా ముగ్గుల పోటీలు

రాజాం: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థినులకు ముగ్గుల పోటీలు ఆదివారం నిర్వహించారు. ఈ పోటీల్లో 35 మంది పాల్గొని, వివిధ ముగ్గుల వేసి, ప్రతిభ చాటుకున్నారు. విజేతలకు ఈ నెల 20వ తేదీన బహుమతులు అందజేస్తామని గ్రంథాలయాధికారి వై.అమర్నాథ్ తెలిపారు.

# పశువులకు ఆరోగ్య కార్డుల పంపిణీ


మాట్లాడుతున్న ఏడీఏ డాక్టర్ సీహెచ్ దీనకుమార్

సీతానగరం: పశువుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం కల్పించి హెల్త్‌కార్డులు పంపిణీ చేస్తున్నట్లు పశు సంవర్ధక శాఖ ఏడీఏ డాక్టర్ సీహెచ్ నవీన్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ సీతానగరం సబ్ డివిజన్ పరిధిలో ఉన్న బలిజిపేట, సీతానగరం మండలంలోని పశువులకు హెల్త్ కార్డులు జారీ చేశామని వాటికి ఎప్పుడెప్పుడు ఏవిధమైన వైద్య సేవలందించామో కార్డుల్లో పొందు పరిచినట్లు చెప్పారు. ఎప్పుడు ఏ వైద్యుడు వెళ్లినా సంబంధిత పశువులకు అందించిన సేవల ట్రాక్ రికార్డు ఆధారంగా సేవలందిస్తారని తెలిపారు. అత్యవసర కేసులు చేస్తున్న డాక్టర్ వైఎస్సార్ సంచార పశుఆరోగ్య సేవా కేంద్రాల ద్వారా మంచిఫలితాలు వస్తున్నాయని తెలియజేశారు. కార్యక్రమంలో పాడిరైతులు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులకు శంకుస్థాపన


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ జర్జాపు దీప్తి, తదితరులు

సాలూరు: మున్సిపాలిటీ 8వ వార్డు పరిధి కొంకివీధిలో పలు అభివృద్ధి పనులకు మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ జర్జాపు దీప్తి ఆదివారం శంకుస్థాపన చేశారు. సుమారు 7 లక్షల రుపాయల గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో రోడ్లు, పైలెట్ వాటర్‌స్కీమ్ నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర నేతృత్వంలో మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు ముమ్మరం చేస్తున్నామని తెలిపారు. పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు జర్జాపు ఈశ్వరరావు, సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

# పార్వతీపురంలో బిగ్ స్క్రీన్ ఏర్పాటు


ఏర్పాటుచేసిన బిగ్ స్క్రీన్

పార్వతీపురం టౌన్: ఐసీసీ క్రికెట్ ప్రపంచ్ కప్ సందర్భంగా ఆదివారం పార్వతీపురం పట్టణంలోని బంధంవారి వీధి కూడలిలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యంలో బిగ్ స్క్రీన్ ఏర్పాటు చేశారు. ఉత్కంఠ భరితంగా జరిగిన ఇండియా, ఆస్ట్రేలియా ఫైనల్ మ్యాచ్‌ను పట్టణ ప్రజలతో కలిసి ఎమ్మెల్యే జోగారావు వీక్షించారు.


ప్రజలతో కలిసి మ్యాచ్ వీక్షిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

## సత్యసాయి జయంతి వేడుకలు

పాలకొండ రూరల్: భగవాన్ శ్రీసత్యసాయి జయంతి ఉత్సవాలను స్థానిక సత్యసాయి మందిరంలో ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయి మందిరంలో రూ.8 లక్షలతో పునరుద్ధరించిన ప్రధాన మందిరాన్ని సేవాసమితి జిల్లా అధ్యక్షుడు నేతాజీ నాయుడు, కన్వీనర్ ఆర్.కిశోర్ తదితరులు ప్రారంభించారు. అర్చకులు రామశేషు నేతృత్వంలో ప్రత్యేక పూజలు, రుద్రాభిశేఖాలు, సామూహిక కుంకుమార్చనలు చేశారు. అనంతరం మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు.

# గర్భిణులకు సామూహిక సీమంతాలు


సామూహిక సీమంతాలకు హాజరైన గర్భిణులు

వీరఘట్టం: భగవాన్ శ్రీసత్యసాయిబాబా 98వ జయంత్యుత్సవాల్లో భాగంగా స్థానిక సత్యసాయి సేవాసమితిలో ఆదివారం మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సాయిభక్తులు గర్భిణులకు సామూహిక సీమంతాలు చేశారు. పసుపు, కుంకుమ, గాజులతో అలంకరించి జాకెట్లు, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం సాయి నామ సంకీర్తనలు ఆలపించారు. కార్యక్రమంలో సమితి మహిళా కన్వీనర్ కందుల లక్ష్మి, వడ్డాది సావిత్రమ్మ, కిల్లారి కొండమ్మ, నీలిమ, సమితి కన్వీనర్ వారాడ గౌరీ, తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ టి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. దివంగత ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు.

# వైభవంగా అయ్యప్ప పూజలు


అంబలంపూజకు వచ్చిన సినీనటులను సాదరంగా ఆహ్వానిస్తున్న అర్చకులు


పాల్గొన్న ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్, డాక్టర్ రామ్మోహనరావు

సీతానగరం: మండలంలోని పలుగ్రామాల్లో గల దేవాలయాలు, సన్నిధానాల్లో అయ్యప్ప దీక్షలు తీసుకున్న వందలాది మంది భక్తులతో నిర్వాహకులు ఆదివారం అంబలం, పడి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.బూర్జలో వందమంది దీపావళి నుంచి అయ్యప్ప దీక్షలు తీసుకుని స్థానిక శివాలయం వద్ద పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో చెల్లంనాయుడువలసలో తెంటు ఈశ్వరరావు (పానీపూరీ శివ) ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి పడిపూజ నిర్వహించగా సీతానగరం, బొబ్బిలి, పార్వతీపురం మండలాలకు చెందిన వందలాది మంది అయ్యప్ప భక్తులలో వేణుగోపాలస్వామి ఆలయ ప్రధాన అర్చకుడు ప్రత్యేక పూజలు చేయించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, వైద్యులు, విజయవాడ, హైదరాబాద్ ప్రాంతాలకు చెందిన సినీనటులను ఆహ్వానించి ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమానికి హాజరైన జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, వైఎస్సార్‌సీపీ మండల సీనియర్ నాయకుడు బి. శ్రీరాములునాయుడు, ఏపీ టిడ్కోచైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్, ప్రముఖ శస్త్రచికిత్స నిపుణుడు డి.రామ్మోహనరావు, వైఎస్సార్ సీపీ నాయకులు కాపారపు శివున్నాయుడు, శంబంగి శ్రీకాంత్, వెంకటాపురం సర్పంచ్ బి.శ్రీనివాసరావు, బి.ముకుందరావు, వై గోపాలనాయుడు పూజలు చేశారు. దూర ప్రాంతాలనుంచి వచ్చిన భక్తులతో పాటు అయ్యప్పలందరికీ మంటపంలోనే భిక్ష కార్యక్రమాన్ని నిర్వాహకులు ఏర్పాటు చేశారు.

# టీడీపీ-జనసేన ఉమ్మడి మేనిఫెస్టో దిగదుడుపే

గుమ్మలక్ష్మీపురం: తెలుగుదేశం పార్టీ-జనసేన పార్టీల ఉమ్మడి మేనిఫెస్టో దిగదుడుపేనని జిల్లా ఎస్టీ సెల్ కన్వీనర్, వైఎస్సార్‌సీపీ నాయకుడు అడ్డాకుల చిన్నారావు అన్నారు. ఈమేరకు ఆదివారం ఆయన గుమ్మలక్ష్మీపురంలో విలేకర్లతో మాట్లాడుతూ.. ఉమ్మడి మేనిఫెస్టోలో పొందుపరచిన 11 అంశాలు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సామాజిక, సంక్షేమ, అభివృద్ధి పథకాల ముందు దిగదుడుపేనని అన్నారు. కౌలు రైతులకు ఏడాదికి రూ.20 వేలు, నిరుద్యోగ యువతకు రూ.10 లక్షల ఆర్థిక సాయం, 3 గ్యాస్ సిలిండర్లు ఉచితం వంటి పథకాల అమలుతో ఒనగూడేదేమీ ఉండదని, 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా అధికారం వెలగబెట్టిన టీడీపీ అధినేతకు సామాజిక న్యాయం అన్న స్పృహే లేకుండా పోయిందని దుయ్యబట్టారు. క్షేత్రస్థాయిలో నాయకత్వలేమితో ఊగిసలాడుతున్న జనసేనతో టీడీపీ పొత్తులపై గానీ, పవన్ కళ్యాణ్ నాయకత్వంపై గానీ ప్రజలు విశ్వసించడం లేదని, సరికదా ఇరుపార్టీల ద్వితీయ శ్రేణి నాయకుల మధ్య ప్రకంపనలు మొదలై కుర్చీలతో కుమ్ములాటకు పొత్తులు పొడిసినట్లుగా ఉందని చిన్నారావు ఎద్దేవా చేశారు.

# కాలినడకన.. తిరుమలకు..

రాజాం సిటీ: వెంకటేశ్వరస్వామి మాల ధరించిన భక్తులు తిరుమల తిరుపతి దేవస్థానానికి కాలినడకన ఆదివారం పయనమయ్యారు. రాజాం ప్రాంతానికి చెందిన పడాల గుణవెంకటేష్, వావిలపల్లి కన్నయ్య గురుస్వామి ఆధ్వర్యంలో రాజాం, ఉంగరాడమెట్ట, పాలకొండకు చెందిన 15 మంది దీక్షాపరులు బయలుదేరారు. స్థానిక అంబేద్కర్ జంక్షన్ వద్ద కాలినడకన తిరుమలకు వెళ్తున్న వీరికి మహిళలు హారతులిచ్చారు. డిసెంబర్ 23వ తేదీన జరగనున్న వైకుంఠ ఏకాదశి నాటికి తిరుమల చేరుకుంటామని భక్తులు తెలిపారు. వీరంతా దారి పొడవునా గోవింద నామాన్ని స్మరిస్తూ ముందుకు వెళ్తుండడంతో వారు వెళ్లిన చోట ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంటోంది.

## దిశ యాప్‌తో మహిళలకు రక్షణ

బాడంగి: రాష్ట్ర ప్రభుత్వం రూపొందించి, అందుబాటులోకి తీసుకువచ్చిన దిశ యాప్‌తో మహిళలకు రక్షణ కలుగుతుందని ఎస్‌ఐ ఆర్.జయంతి అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో దిశ చట్టంపై ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ చట్టం వచ్చిన తర్వాత రాష్ట్రంలో మహిళలపై దాడులు తగ్గాయన్నారు. మంచి నడవడికతో ఉత్తమ పౌరులుగా నిలవాలన్నారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ ఆర్.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.